క్లుప్తంగా

సెంట్రల్ లైటింగ్ పనులు ప్రారంభం

సాక్షి ఎఫెక్ట్..

పాల్వంచ: పట్టణంలోని కేఎస్పీరోడ్‌లో సెంట్రల్ లైటింగ్ పనులు సోమవారం ప్రారంభమయ్యాయి. పాలకులు, అధికారుల సమన్వయ లోపం కారణంగా అంబేడ్కర్ సెంటర్ నుంచి అల్లూరి సెంటర్ వరకు సెంట్రల్ లైటింగ్ పనులు నిలిచిపోయాయి. ఆదివారం 'అంతా అయింది.. లైట్లు ఏవి?' అనే శీర్షికతో 'సాక్షి'దినపత్రికలో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. సోమవారం సెంట్రల్ లైటింగ్ పనులను ప్రారంభించారు. ఆర్ అండ్‌బీ ఏఈ వంశీ మాట్లాడుతూ సెంట్రల్ లైటింగ్ పనులు చేపట్టామని, సాధ్యమైనంత త్వరగా పూర్తి చేస్తామన్నారు.

మృతికి సంతాపం

చుంచుపల్లి: సీపీఐ సీనియర్ నాయకుడు, విద్యానగర్ ఉప సర్పంచి భర్త వనమా పిచ్చయ్య (57) గుండెపోటుతో సోమవారం మృతి చెందారు. పలువురు నాయకులు నివాళులర్పించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు పిచ్చయ్య కుటుంబీకులను ఫోన్‌లో పరామర్శించగా జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్‌పాషా, నాయకులు వాసిరెడ్డి మురళి, బానోత్ గోవిందు తదితరులు మృతదేహం వద్ద నివాళులర్పించారు.

నేడు రక్తదాన శిబిరం

చుంచుపల్లి: ఆర్టీసీ యాజమాన్యం ఆదేశాల మేరకు మంగళవారం కొత్తగూడెం డిపోలో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ బాణాల వెంకటేశ్వరరావు తెలిపారు. రక్తదాతలు నేరుగా హాజరుకావాలని సూచించారు.

వివాహిత అదృశ్యం

పాల్వంచరూరల్: ఇంటి నుంచి బయటకు వెళ్లిన భార్య తిరిగి రాలేదని ఓ వ్యక్తి సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మండలంలోని తవిశలగూడెంనకు చెందిన కొమురం వెంకటేశ్వర్లు భార్య ఈ నెల 24న ఇంటి నుంచి బయటకు వెళ్లగా బంధువుల ఇళ్లలో గాలించారు. అయినా ఫలితం లేపోవడంతో వెంకటేశ్వర్లు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని ఎస్‌ఐ ఎం.శ్రీనివాస్ తెలిపారు.

29న ప్రత్యేక పూజలు

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం పట్టణం బాబూక్యాంప్‌లోని శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయంలో ఈ నెల 29న తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నామని విశ్వ హిందూ పరిషత్ బాధ్యులు వందనపు చిరంజీవి, దుర్గాప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

రేపు బహిరంగ వేలం

జూలూరుపాడు: ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు ఈ నెల 28వ తేదీన కొత్తగూడెం ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ ఆవరణలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఎక్సైజ్ సీఐ జయశ్రీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గలవారు వేలంలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

డీవీ కృష్ణకు ఘన నివాళి

జూలూరుపాడు: సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి డీవీ కృష్ణ ప్రథమ వర్ధంతిని ఆ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం జూలూరుపాడులో నిర్వహించారు. కృష్ణ చిత్రపటానికి సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బానోత్ ధర్మా, వై.గోపాల్‌రావు, రాయల సిద్ధు, ఎం.కృష్ణయ్య, బానోత్ సేవియా, బాదావత్ రాజు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా లక్ష్మణ్

చుంచుపల్లి: కాంగ్రెస్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడిగా శనగ లక్ష్మణ్ నియమితులయ్యారు. సోమవారం ఆయనకు ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు చింతిర్యాల రవి నియామకపత్రాన్ని అందించారు. కాగా, తనకు రావడానికి సహకరించిన డీసీసీ అధ్యక్షుడు పొదెం వీరయ్య, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఎడవల్లి కృష్ణతో పాటు రవికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో రాయల శాంతయ్య, బొమ్మిడి మల్లికార్జున్, అంతోటి పాల్, బద్ది కిశోర్, నాగరాజు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం హర్షణీయం

టేకులపల్లి: కుల వృత్తులవారికి రూ.లక్ష ఇవ్వడం హర్షణీయమని, కానీ, ఎలాంటి అవకతవకలు లేకుండా పూర్తి పారదర్శకంగా కార్యక్రమం అమలు చేయాలని విశ్వ బ్రాహ్మణ సంఘం నాయకులు తౌడోజు భిక్షమయ్య, వజ్రాల పరిపూర్ణాచారి పేర్కొన్నారు. సోమవారం సంఘం సమావేశంలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో చిలకమర్రి రాంబ్రహ్మాచారి, ధర్మపురి జనార్దనాచారి, పర్వతపు ఉపేంద్రాచారి, జూకంటి సందీప్, తౌడోజు గోకుల్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న విచారణ

ఇల్లెందురూరల్: మండలంలోని పలు గ్రామాల్లో బీసీ రుణాల కోసం అందిన దరఖాస్తులపై విచారణ సాగుతోంది. ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులను గ్రామ పంచాయతీల వారీగా విభజించి విచారించాల్సిన బాధ్యతను పంచాయతీ కార్యదర్శులకు అప్పగించారు. మండలంలోని 29 గ్రామాల్లో సోమవారం వారు దరఖాస్తుదారుల ఇళ్లకు వెళ్లి విచారించారు.

షురూ కాని 'డయాలసిస్'

- కేంద్రం ప్రారంభించి నెల రోజులు
- ఒకరిపై ఒకరు నెపం వేస్తూ కాలయాపన


ఇల్లెందులోని ప్రభుత్వ వైద్యశాల

ఇల్లెందు: ఇల్లెందు ప్రభుత్వాస్పత్రిలో డయాలసిస్ సెంటర్ ప్రారంభించి మంగళవారానికి నెల రోజులు అవుతోంది. కానీ, నెల రోజులుగా ఒక్క రోగికి కూడా ఈ సేవలు అందలేదు. అందుకు విద్యుత్ సరఫరా కారణమని వైద్యశాఖ అంటుండగా కాంట్రాక్టర్‌దే ఆలస్యమని విద్యుత్‌శాఖ అధికారులు చెబుతున్నారు. అటు వైద్యశాఖ ఇటు విద్యుత్ శాఖల మధ్య రోగులకు డయాలసిస్ సేవలు అందకుండా పోతున్నాయి. ఇల్లెందు ప్రభుత్వ వైద్యశాలలో డయాలసిస్ సెంటర్ ప్రారంభించినా నిరుపయోగంగా మారింది. డయాలసిస్ సేవలు ప్రారంభించాలంటే సక్రమంగా విద్యుత్ సరఫరా జరగాలి. ఇక్కడ విద్యుత్ వస్తూ పోతూ ఉంటుంది. దీనికి తోడు జనరేటర్, సోలార్ పని చేయటం లేదు. జనరేటర్ ఉన్నా సక్రమంగా కరెంటు లేకపోతే జనరేటర్ మీద పూర్తిస్థాయిలో పనిచేయించలేమని వైద్యశాఖ అధికారులు చెబుతున్నారు. వైద్యశాలలో విద్యుత్ సమస్య తీవ్రంగా వేధిస్తోంది. ఇల్లెందు ఆస్పత్రి వైద్య విధాన పరిషత్‌లోకి మారిన తర్వాత సదుపాయాలు, వైద్యుల నియామకం పెరిగింది. అందులో భాగంగా డయాలసిస్ సెంటర్ కూడా ఏర్పాటు చేశారు. ప్రజలకు తగిన వైద్యం అందించేందుకు పరీక్షల నిర్ధారణ కోసం పలు రకాల మిషన్లు కూడా ఏర్పాటు చేశారు. వైద్యశాలలో అన్ని గదులను వినియోగంలోకి తీసుకొచ్చారు. అందువల్ల విద్యుత్ వాడకం అనూహ్యంగా పెరిగింది. లోడు అధికం కావటం వల్ల విద్యుత్ అప్ అండ్ డౌన్ అవుతోంది. ఎక్స్‌రే, రేడియాలజీ మిషన్, ల్యాబ్, ఏసీలు, ఫ్రిజ్‌లు, ఆపరేషన్ థియేటర్లు, ఎస్‌ఎంబీఎస్ సెంటర్ల సేవలతో విద్యుత్ వినియోగం ఎక్కువగా ఉంటోంది. ఆస్పత్రిలో విద్యుత్ అధిక లోడును తగ్గించేందుకు ప్రత్యేకంగా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాల్సి ఉందని వైద్యశాఖ అధికారులు చెబుతున్నారు. అప్పుడే విద్యుత్ అప్ అండ్ డౌన్ సమస్య తీరుతుందంటున్నారు.


ఆస్పత్రిలోని డయాలసిస్ సెంటర్

రోగుల అవస్థలు..

ఇల్లెందు డయాలసిస్ సెంటర్ పరిధిలో సుమారు 40 మంది వరకు డయాలసిస్ రోగులు ఉన్నారు. వారిలో రోజు విడిచి రోజు, మూడు రోజులకోసారి, వారానికి ఒక రోజు డయాలసిస్ చేసుకోవాల్సిన వారున్నారు. వారంతా ఖమ్మం, కొత్తగూడెం, మహబూబాబాద్‌లాంటి పట్టణాలకు వెళ్లి డయాలసిస్ సేవలు పొందివస్తున్నారు. అయితే డయాలసిస్ కోసం వెళ్లిన ప్రతీసారి రూ.10 వేలకు పైగా ఖర్చు వస్తోందని మదనపడుతున్నారు. నెలరోజులైనా సెంటర్ ద్వారా సేవలు అందకపోవటం బాధాకరమని వారు పేర్కొంటున్నారు.

విద్యుత్ సమస్యే కారణం..



వైద్యశాలలో డయాలసిస్ సెంటర్ పని చేయకపోవడానికి విద్యుత్ సమస్యే కారణం. రెండు నెలల కిందట నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని రూ.6 లక్షలు డీడీ అందజేశారు. పలు రకాల కారణాలతో ఏర్పాటు ఆలస్యమవుతోంది. ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తే వైద్యశాలలో అన్ని సమస్యలకు పరిష్కారం లభించినట్లే.

–డాక్టర్ శిరీశ్‌కుమార్, ఆస్పత్రి సూపరింటెండెంట్

భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దు..


జూలూరుపాడు: అవగాహన కల్పిస్తున్న దృశ్యం


టేకులపల్లి: ప్రతిజ్ఞ చేస్తున్న సీఐ, సీడీపీఓ తదితరులు

జూలూరుపాడు: మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా సోమవారం గుండెపుడి హైస్కూల్‌లో ఐసీడీఎస్ చండ్రుగొండ ప్రాజెక్టు ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హైస్కూల్ హెచ్‌ఎం లలితాభవానీ మాట్లాడుతూ.. క్షణికానందం కోసం బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని తెలిపారు. మాదక ద్రవ్యాలు విడిచిపెట్టి జీవితానికి బంగారు బాటలు వేసుకోవాలన్నారు. మాదక ద్రవ్య రహిత తెలంగాణ నిర్మాణానికి పరివర్తన ఉద్యమంలో మనమంతా పాల్గొనాలని అంగన్‌వాడీ టీచర్లు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ఉంటామని విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్ వైజర్లు సుజాత, నాగమణి విద్యార్థులు పాల్గొన్నారు.

అందరూ భాగస్వాములు కావాలి

టేకులపల్లి: సమాజంలో మాదకద్రవ్యాల నివారణలో అందరూ భాగస్వాములు కావాలని ఐసీడీఎస్ టేకులపల్లి ప్రాజెక్టు సీడీపీఓ కె.ఎం.తార, టేకులపల్లి సీఐ ఇంద్రసేనారెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పాఠశాల, కాలేజీ విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. మాదక ద్రవ్యాల నివారణకు అందరం సహకరిస్తామని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన అవగాహన సదస్సులో సీడీపీఓ, సీఐ మాట్లాడారు. ప్రస్తుత ఆధునిక చిన్నాపెద్ద తేడా లేకుండా అధిక శాతం మాదక ద్రవ్యాలకు బానిసలుగా మారుతున్నారన్నారు. మాదక ద్రవ్యాలతో పాటు మత్తు పానీయాలు, సిగరెట్, పాన్ మసాలా, గుట్కా కూడా ఆరోగ్యానికి హాని కలిగిస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో బోడ నిరోషా, బోడ సరిత, భద్రు పాల్గొన్నారు.

జైలుకు వెళ్లేందుకైనా సిద్ధమే..

సూపర్‌బజార్(కొత్తగూడెం): విద్యార్థుల భవిష్యత్తు కోసం జైలుకు వెళ్లడానికైనా సిద్ధమేనని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర సహాయకార్యదర్శి దామెర కిరణ్ అన్నారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కేఎస్‌ఎం ఇంజనీరింగ్ కళాశాల నుంచి కలెక్టరేట్ వరకు ప్రదర్శన నిర్వహించిన అనంతరం ధర్నా చేశారు. కలెక్టరేట్‌లోకి చొచ్చుకువెళ్లే ప్రయత్నం చేయగా పోలీసులతో తోపులాట జరిగింది. తరువాత గేటు లోపల బైఠాయించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడారు. రూ.4,500 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని, పాఠశాలల్లో మౌలిక సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి బుర్ర వీరభద్రం మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా విద్యారంగ సమస్యలను పరిష్కరించేంతవరకు సమరశీల పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు గార్లపాటి పవన్, జిల్లా ఉపాధ్యక్షులు భూపేందర్, అభిమన్యు, నవీన్, సందీప్, నాగకృష్ణ, జిల్లా నాయకులు పవన్, భవ్య తదితరులు పాల్గొన్నారు.


ధర్నా చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

ప్రజల దాహార్తి తీర్చడంలో విఫలం


మాట్లాడుతున్న ముత్యాల విశ్వనాథం

పాల్వంచ: పట్టణ ప్రజల దాహార్తిని తీర్చడంలో అధికార యంత్రాంగం విఫలమైందని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు ముత్యాల విశ్వనాథం అన్నారు. సోమవారం స్థానిక సీఆర్‌భవన్‌లో పార్టీ పట్టణ కార్యవర్గ సమావేశం నిర్వహించగా ఆయన పాల్గొని మాట్లాడారు. మున్సిపాలిటీ సమస్యలపై ఈ నెల 28వ తేదీన సీపీఐ ఆధ్వర్యంలో ముట్టడి కార్యక్రమాన్ని చేపట్టామని, దీనిని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, బండి నాగేశ్వరరావు, ఉప్పుశెట్టి రాహుల్, వి.పద్మజ, గుండాల నాగరాజు, అన్నారపు వెంకటేశ్వర్లు, ఉపేంద్రాచారి, సంఘమిత్ర, ఈశ్వరమ్మ, అజిత్, చందులాల్, చేరాలు, సత్యనారాయణ, రమేశ్, కృష్ణ, రామారావు పాల్గొన్నారు.

వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చాలి

సూపర్‌బజార్(కొత్తగూడెం): వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చాలని కోరుతూ తెలంగాణ వడ్డెర సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు తేపర్ల దుర్గారావు, ప్రధాన కార్యదర్శి చల్లా సురేశ్ మాట్లాడుతూ 1952లో వడ్డెరలను డీఎస్‌టీలో చేర్చారని, 1976 తర్వాత దేశంలోని అనేక రాష్ట్రాల్లో డీఎస్‌టీలో ఉన్న అన్ని కులాలతో పాటు వడ్డెరలను కూడా ఎస్సీ, ఎస్టీగా గుర్తించారని చెప్పారు. తెలంగాణలో మాత్రం ఎస్టీలుగా మారకుండా బీసీలుగానే మిగిలిపోయామని వాపోయారు. తమ స్థితిగతులను గుర్తించి వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చాలని కోరారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వేముల ప్రసాద్, గుర్రం శ్రీనివాస్, బోదాసు కనకరాజు, దండగల పుల్లారావు, తమ్మిశెట్టి శ్రీనివాస్, సురా సంతోష్, కె.కాశి, బోసు శ్రీను, తురక మధు, దేరంగుల వెంకన్న, గోగుల ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షుడిగా పల్లపు

చుంచుపల్లి: జిల్లా వడ్డెర సంఘం అధ్యక్షుడిగా పల్లపు వెంకటేశ్వర్లును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం చుంచుపల్లి మండలం విద్యానగర్‌లోని ఏవీ ఫంక్షన్ హాల్లో జరిగిన జిల్లా వడ్డెర సంఘం ముఖ్య నాయకుల సమావేశంలో ఆయనను ఎన్నుకున్నారు. అనంతరం వడ్డెర ట్రస్ట్ చైర్మన్ జేరిపేట సత్యనారాయణ, వైస్ చైర్మన్ ఎత్తిరి అంతయ్య సమక్షంలో పల్లపు వెంకటేశ్వర్లు ప్రమాణ స్వీకారం చేశారు. ఆయనతో పాటు కార్యవర్గ సభ్యులను గజమాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రామల చందర్‌రావు, బాణం నాగేశ్వరరావు, సాయిరాం, వెంకటేశ్వర్లు, మహేశ్, శేఖర్, నర్సింహారావు, వెంకట్రావ్, మేఘనాథం, భాస్కర్, రాజు, దుర్గ తదితరులు పాల్గొన్నారు.


వెంకటేశ్వర్లును సన్మానిస్తున్న నాయకులు

కిన్నెరసాని గురుకులంలో 'బాయ్స్ ఫర్ చేంజ్'



మాట్లాడుతున్న ఎస్.రవికుమార్

పాల్వంచరూరల్: కిన్నెరసాని డ్యామ్‌సైడ్‌లోని గిరిజన గురుకుల ప్రతిభ కళాశాలలో సోమవారం వాయిస్ ఫర్ గర్ల్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో 8వ తరగతి విద్యార్థులకు 'బాయ్స్ ఫర్ చేంజ్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఎస్.రవికుమార్ మాట్లాడుతూ మానసిక ఎదుగుదల, శారీరక మార్పులు, చదువుపై ఆసక్తి చూపడం, సామాజిక స్పృహ లాంటి అంశాలపై అవగాహన కల్పించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని, విద్యార్థుల్లో నైపుణ్యం పెంచేందుకు గురుకుల సొసైటీ దీనిని ప్రారంభించిందని వెల్లడించారు. కార్యక్రమంలో ఆర్గనైజేషన్ బాధ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వాసవీ, వనిత క్లబ్ సేవలు మరువలేనివి..

పాల్వంచ: వాసవీ, వనితాక్లబ్ సేవలు మరువలేనివని తహసీల్దార్ రంగాప్రసాద్ తెలిపారు. సోమవారం స్థానిక రాయాలయంలో రెండు క్లబ్‌ల ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేసి ఆలయ సిబ్బంది, పలువురు ఆర్యవైశ్య పేదలకు నిత్యావసరాలు అందించారు. రైతులకు పురుగుమందులు, ఆలయంలో భక్తులు కూర్చుకునేందుకు బల్లాలు, వ్యాపారులకు గొడుగులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అంతర్జాతీయ కోఆర్డినేటర్ పెండ్యాల రోజాలక్ష్మీ, చలవాది ప్రకాష్, జూలూరి మల్లేశ్, జూలూరి మణి, సాయిబాబా, నాగ శ్రీలత, వంకదారు ఇందుమతి, శ్రీనివాస్, తేజ, కుటుంబరావు, దారా నర్సింహారావు, వనజా తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుదారులందరికీ పోడు పట్టాలు ఇవ్వాలి

టేకులపల్లి: పోడు భూములు సాగు చేసుకుంటూ దరఖాస్తు చేసుకున్న రైతులందరికీ పోడు పట్టాలు ఇవ్వాలని న్యూడెమోక్రసీ మండల కార్యదర్శి కల్తీ వెంకటేశ్వర్లు, ఐఎఫ్‌టీయూ నాయకుడు డి.ప్రసాద్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సోమవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ తక్షణమే పోడు రైతులందరికీ పట్టాలు ఇవ్వాలని, లేనిపక్షంలో మరోమారు ఉద్యమించాల్సి వస్తుందని హెచ్చరించారు. కాగా, పట్టాల కోసం ఈ నెల 27 నుంచి జూలై 8 వరకు జరిగే ఆందోళనలు, జూలై 8న చేపడుతున్న ఇల్లెందు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడిని విజయవంతం చేయాలని కోరారు.

ఎమ్మెల్యేను కలిసిన జీఎం

ఇల్లెందు: ఇల్లెందు ఎమ్మెల్యే హరిప్రియను ఆమె క్యాంపు కార్యాలయంలో సింగరేణి ఇల్లెందు ఏరియా జీఎం జాన్ ఆనంద్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. జీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారి కార్యాలయానికి వెళ్లి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆయన వెంట ఎస్‌ఓటూ జీఎం మల్లారపు మల్లయ్య, గుర్తింపు సంఘం ఉపాధ్యక్షుడు ఎస్.రంగనాథ్, ఎస్టేట్ అధికారి మహేశ్వర్ ఉన్నారు.

దోమల మందు పిచికారీ

టేకులపల్లి: మలేరియా నివారణకు దోమల మందు పిచికారీ కార్యక్రమాన్ని మండలంలోని లచ్చగూడెం గ్రామంలో వైద్యాధికారి కందుల దినేశ్, సర్పంచ్ జోగా రేణుక ప్రారంభించారు. మలేరియా కేసులు అధికంగా నమోదవుతున్న సంపత్‌నగర్ ఆరోగ్య ఉపకేంద్రం పరిధిలోని అన్ని గ్రామాల్లో మందును రెండుసార్లు పిచికారీ చేస్తామని, ప్రజలందరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని వైద్యాధికారి సూచించారు. కార్యక్రమంలో హరికృష్ణ, సత్యం, శైలజ, పోరండ్ల శ్రీనివాస్, ధనసరి రాంబాబు, మానస, అరుణాదేవి, దొడ్డ సుగుణ, బొర్రా లక్ష్మి, ఈసం బుచ్చమ్మ పాల్గొన్నారు.

సింగరేణి డైరెక్టర్ (పా)కు సన్మానం

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి ప్రధాన కార్యాలయంలో డైరెక్టర్ (పా) ఎన్.బలరాంను గాంధీపథం కన్వీనర్ చింతలచెర్వు గోర్షేం సత్కరించారు. సింగరేణిలో పనిచేస్తూ కార్పొరేట్ బ్యాంకులో ఖాతా ఉన్నవారికి ఉచిత ప్రమాదబీమా రూ.55 లక్షలు కల్పించినందుకు గాను సత్కరించామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో గొల్లపెల్లి పేమానందం, అరుణ, పుష్పమ్మ, మహ్మద్‌రఫీ, ఈశ్వరయ్య, అఫ్జల్, వీరయ్య, ప్రసాద్ పాల్గొన్నారు.

పాఠశాలల్లో పఠనోత్సవం

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలం శ్రీనగర్‌కాలనీ పంచాయతీ ఇందిరానగర్‌కాలనీలోని ప్రభుత్వ పాఠశాలలో పఠనోత్సవ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జ్యోతిరాణి, ఎస్‌ఎంసీ చైర్మన్ ఎస్‌డీ చాంద్‌పాషా, శౌరి ఇన్నయ్య, కల్యాణి, స్రవంతి, స్వప్న, సునంద, మంజుల, భాగ్యమ్మ పాల్గొన్నారు.

సాహు మహరాజ్‌కు నివాళి

కొత్తగూడెంఅర్బన్: సామాజిక న్యాయం అమలుకు 28 ఏళ్ల వయస్సులోనే తన రాజ్యంలో బ్రాహ్మణేతరులకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించి, సమాన అవకాశాలకు పునాదులు వేసిన మహనీయుడు ఛత్రపతి సాహు మహరాజ్ అని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎర్రా కామేశ్ అన్నారు. సోమవారం పార్టీ కార్యాలయం ఎదుట జరిగిన కార్యక్రమంలో మహరాజ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గంధం మల్లికార్జున్‌రావు, చెనిగారపు నిరంజన్‌కుమార్, మాలోత్ వీరు నాయక్, మాలోత్ పూర్ణచందర్ పాల్గొన్నారు.

ఉద్యోగులకు అవగాహన

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియా కాంట్రాక్ట్ ఉద్యోగులకు సోమవారం వైసీఓఏ క్లబ్‌లో అవగాహన నిర్వహించారు. కొత్తగూడెం కార్పొరేట్ డీజీఎం (ఐటీ) హరిశంకర్ మాట్లాడుతూ.. సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు వైద్య సదుపాయం, డైలీహాజరు, మేనేజ్‌మెంట్ విధానంపై అవగాహన కల్పించారు. శ్రీనివాసరావు, నాగదీప్తి, కృష్ణ పాల్గొన్నారు.

కళారూపాలతో 'స్వచ్ఛ పక్వాడ'


పాటతో అవగాహన కల్పిస్తున్న కళాకారులు

ఇల్లెందు: కేంద్ర బొగ్గు మంత్రిత్వశాఖ ఆదేశాల మేరకు ఈ నెల 16 నుంచి 30 వరకు సింగరేణివ్యాప్తంగా స్వచ్ఛత పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. సోమవారం జేకేఓసీ, రొంపేడులో కళారూపాల ద్వారా 'చేయి చేయి కలుపుదాం – స్వచ్ఛ ఉద్యమం చేపడదాం' అనే నినాదంతో స్వచ్ఛతపై అవగాహన కల్పించారు. పరిసరాల పరిశుభ్రతపై కళాప్రదర్శన ఆకట్టుకుంది. స్నేహ, బాషా బృందం ఆలపించిన ఆట పాటా అలరించాయి. ఈ సందర్భంగా జీఎం, సేవా అధ్యక్షురాలు జాన్ ఆనంద్, నిమ్మి ఆనంద్ మాట్లాడుతూ స్వచ్ఛభారత్ గొప్ప కార్యక్రమమని కొనియాడారు. కార్యక్రమంలో ఎస్‌ఓటూ జీఎం మల్లారపు మల్లయ్య, అధికారుల సంఘం అధ్యక్షులు పంజాల శ్రీనివాస్, డీజీఎం (పర్సనల్) జీవీ మోహన్‌రావు, ప్రాజెక్టు ఆఫీసర్ బొల్లం వెంకటేశ్వర్లు, జేకేఓసీ మేనేజర్ పూర్ణచందర్, ఎన్విరాన్‌మెంట్ అధికారి ధనుంజయ్‌రెడ్డి, డీవైపీఎం శ్రీహరి, సీనియర్ పర్సనల్ అధికారి సాయి స్వరూప్, గుర్తింపు సంఘం ఉపాధ్యక్షుడు ఎస్.రంగనాథ్, సెక్రెటరీ విజయ, సులక్షణ, సభ్యులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలని ప్రదర్శన

కొత్తగూడెంటౌన్: పెండింగ్‌లో ఉన్న డ్యూటీ బిల్లులను తక్షణమే చెల్లించాలని కోరుతూ సోమవారం అంగన్‌వాడీ టీచర్ల ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షురాలు, అంగన్‌వాడీ టీచర్ గోనె మణి మాట్లాడారు. బీఎల్‌ఓల విధులకు సంబంధించిన డబ్బులను వెంటనే చెల్లించాలన్నారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా బీఎల్‌ఓ విధులను సైతం నిర్వర్తిస్తున్నామని, అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు జి.ప్రమీల, ప్రతిభాభారతీ, గుణలక్ష్మి, రూపేంద్ర, వసంత, మంజుల, లక్ష్మి, రజిత, నాగమణి, సౌజన్య, మంగతాయారు, కృష్ణవేణి, రజని పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ టీచర్లు

రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ఇల్లెందురూరల్: ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కృష్ణవేణికి వినతిపత్రం అందించారు. సంఘం అధ్యక్ష, కార్యదర్శులు స్వామిదాస్, ముత్తయ్య మాట్లాడుతూ.. 1వ పీఆర్సీ సిఫార్సులకు అనుగుణంగా పెన్షనర్ల మూలవేతనం నుంచి ఒక శాతం మినహాయించి ఈహెచ్‌ఎస్ అమలు చేయాలని కోరారు. సత్యనారాయణ, లక్ష్మీరాజం, వసంతశోభ, రాంమ్మూర్తి, కృష్ణయ్య పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతి

పాల్వంచరూరల్: ఉద్యోగ విరమణ పొందినవారి సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తహసీల్దార్ రంగాప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు.



అటెన్షన్ ప్లీజ్

విద్యుత్ లేదు.. నీళ్లు రావు



టేకులపల్లి మండలం బేతంపూడి స్టేజీలో నిర్మించిన ఆరోగ్య ఉప కేంద్రం (హెల్త్ సబ్‌సెంటర్) సమస్యలకు నిలయంగా మారింది. ఏడాది కిందటే నిర్మాణం పూర్తయిన ఈ కేంద్రంలో విద్యుత్, నీటి సదుపాయం ఏర్పాటు చేయలేదు. ఇక్కడే ఏఎన్‌ఎం కూడా నివాసం ఉండేలా నిర్మాణం చేపట్టారు. కరెంట్ లేకపోవడంతో కొవ్వొత్తి వెలుగులో ఏఎన్‌ఎం జీవనం సాగిస్తుండగా.. దూరం నుంచి బకెట్ల ద్వారా నీరు తెచ్చుకోవాల్సి వస్తోంది.

- టేకులపల్లి

ప్రశ్నించాల్సిన అధికారి : సయ్యద్ సలార్, ఏఈ ఐటీడీఏ, టేకులపల్లి

సెల్ నంబర్ : 97016 19970

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

కె. ప్రదీప్ కుమార్, ACM - 70132 21824 లక్ష్మయ్య, ACO - 8074270476
కొత్తగూడెం యాకూబ్ పాషా - 80083 21148 భద్రాచలం కె. హరేంద్ర - 99632 02011
పినపాక ఎన్. లక్ష్మయ్య - 80742 70476 ఇల్లందు బి. కిషన్ - 63052 41411
అశ్వారావుపేట ఎన్ దుర్గాంప్రసాద్ -79979 58226 టోల్‌ఫ్రీ నెం.: 1800 270 1083

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
Land Line : 08742-282823 / 24

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు : ఎస్. నాగశేషు, యాడ్స్ మేనేజర్- 99122 20600

టి. రాజేష్ - 90102 23783
ఎ. నాగేశ్వరరావు - 97054 44183